క్లుప్తంగా

విద్యార్థినికి సైకిల్ బహూకరణ


విద్యార్థిని హేమశ్రీకి సైకిల్ అందిస్తున్న దృశ్యం

భీమవరం: ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న విద్యార్థులను విద్యలో వెనుకబడిపోకుండా ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని భీమవరం బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు ఎం వెంకటరమణ అన్నారు. ఆదివారం శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇంటర్ విద్యార్థిని తాడిశెట్టి హేమశ్రీకి దాతల సహకారంతో సైకిల్, నగదు అందించారు. కార్యక్రమంలో చెరుకువాడ రంగసాయి, ఉండపల్లి రమేష్ నాయుడు, కె నర్సింహరావు, ఆర్ఎస్ పాల్గొన్నారు.

వరకట్న వేధింపులపై కేసు నమోదు

భీమవరం: వరకట్న వేధింపులపై భీమవరం వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. వివరాల ప్రకారం మెంటేవారితోటకు చెందిన పవన్ కుమార్‌కు, ఎ. సునీతకు 2011లో ప్రేమ వివాహమైంది. వీరికి ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. ఉపాధి నిమిత్తం పవన్‌కుమార్ 2019లో గల్ఫ్ దేశాలకు వెళ్లి అప్పులు చేశాడు. అక్కడనుంచి తిరిగి వచ్చి వేరో మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకుని కుటుంబానికి దూరంగా ఉంటున్నాడు. అప్పట్లో ప్రేమ వివాహం వల్ల కట్నం తీసుకురాలేదని ఇప్పుడు కట్నం తీసుకురమ్మని భర్త పవన్ కుమార్ వేధిస్తున్నాడని ఎ.సునీత పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్సై వీవీఎస్ కృష్ణాజీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని పలు జిల్లాల నుంచి ఇఫ్టూ అనుబంధ ఏపీ ప్రగతిశీల భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ ప్రతినిధులు పేర్కొన్నారు. భవన నిర్మాణ సంక్షేమ బోర్డు (బీఓసీ బోర్డు) చైర్మన్ వలవల బాబ్జీకి ఇఫ్టూ బీఓసీ సంఘ నాయకులు, సభ్యులు ఆదివారం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు జె.వెంకటేశ్వర్లు, బి.వెంకట్రావు, నాయకులు పోలారి, కేవీ రమణ, కాకర్ల శ్రీనివాస్, మోహన్, ఏసురత్నం, గపూర్, మహమ్మద్, తదితరులు పాల్గొన్నారు.

మలేరియాపై అప్రమత్తంగా ఉండాలి

తణుకు అర్బన్: మలేరియా నివారణ మాసోత్సవం-జూన్ 2025 కార్యక్రమాన్ని ఆదివారం తణుకు ఫైలేరియా కంట్రోల్ యూనిట్ ఆవరణలో సబ్ యూనిట్ ఆఫీసర్ జి. వెంకటేశ్వరరావు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ జూన్‌లో క్షేత్ర స్థాయి సిబ్బంది మలేరియా వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పిస్తారన్నారు. కార్యక్రమంలో యు.శివప్రసాద్, ఎ.భృంగేశ్వర రావు, ఎ.శ్రీరామమూర్తి, ఫైలేరియా యూనిట్ సూపర్‌వైజర్ కె.సత్యన్నారాయణ, హెల్త్ అసిస్టెంట్ ఎం.శ్రీనివాస్ పాల్గొన్నారు.

చెస్‌లో బాలశ్రీ కార్తీక్ ఉత్తమ ప్రతిభ



ప్రతిభ చూపిన బాలశ్రీ కార్తీక్

తాడేపల్లిగూడెం (టీఓసీ): చెస్ రేపిడ్ విభాగంలో పట్టణానికి చెందిన వంగపండు బాలశ్రీ కార్తీక్ ప్రతిభ చూపారు. ఇటర్నేషనల్ చెస్ ఫిడే రేటింగ్ (రేపిడ్ విభాగం)లో 1556 రేటింగ్ సాధించారు. కార్తీక్ భారతీయ విద్యాభవన్స్ స్కూల్‌లో ఎనిమిదో తరగతి చదువుతున్నాడు. మే 3, 4 తేదీల్లో హైదరబాద్ బంజారాహిల్స్‌లో మెరిడియన్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో నిర్వహించిన టోర్నమెంట్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు కార్తీక్ తండ్రి బాల మురళీకృష్ణ తెలిపారు. కార్తీక్ గ్రాండ్ మాస్టార్ స్థాయికి చేరుకోవాలని పలువురు అభినందించారు.

కిడ్నీ బాధితురాలికి ఆర్థిక సాయం


చెక్కును అందజేస్తున్న డాక్టర్ పద్మావతి

అత్తిలి: శ్రీవిశ్వ విజ్ఞాన విద్య ఆధ్యాత్మిక పీఠాధిపతి డాక్టర్ ఉమర్ ఆలీషా ప్రబోధాలకు ప్రేరణ పొంది పీఠం సభ్యులు సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని ఆకివీడుకు చెందిన డాక్టర్ దండు పద్మావతి అన్నారు. పీఠం అనుబంధ సంస్థ ఉమర్ ఆలీషా రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్టు ద్వారా ఆదివారం మండలంలోని బల్లిపాడు గ్రామంలో పీఠం సభ్యురాలైన దారపరెడ్డి మహేశ్వరి కిడ్నీ ఆపరేషన్ నిమిత్తం రూ.70,750 చెక్కును అందజేశారు. డాక్టర్ దండు పద్మావతి సౌజన్యంతో బల్లిపాడులో మూడు అంగన్‌వాడీ కేంద్రాలకు ఐరన్ ర్యాక్‌లను బహూకరించారు. కార్యక్రమంలో పీఠం సభ్యులు పాల్గొన్నారు.

వ్యవసాయం.. దయనీయం

- కూటమి పాలనలో వ్యవసాయ రంగంపై నిర్లక్ష్యం
- ఏడాది పాలనలో అందని రైతు భరోసా
- ఇన్‌పుట్ సబ్సిడీ మాటే లేదు



వీరవాసరం మండలం నవుడూరు గ్రామంలో రైతు భరోసా కేంద్రం

భీమవరం: ఒకప్పుడు వ్యవసాయం దండగన్న చంద్రబాబు మళ్లీ అధికారం చేపట్టగానే వ్యవసాయాన్ని నిర్వీర్యం చేస్తున్నట్లుంది. ఎన్నికల్లో రైతులకిచ్చిన హామీలను గడిచిన ఏడాదికాలం పాలనలో ఒక్కటి కూడా అమలుచేయకపోగా ఆరుగాలం కష్టపడి రైతన్నలు పండించుకున్న పంటలకు గిట్టుబాటు ధరలు లేకుండా రైతులను అప్పుల పాల్జేస్తున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వ్యవసాయానికి పెద్దపీట వేసి రైతన్నలకు అండగా నిలవడంతో రైతులు సంతోషంగా వ్యవసాయం చేశారు. భీమవరం నియోజకవర్గంలోని భీమవరం రూరల్, వీరవాసరం మండలాల్లో దాదాపు 20 వేల ఎకరాల్లో వరిసాగు చేస్తుండగా సుమారు 5 వేల ఎకరాల్లో రొయ్యల సాగు చేస్తున్నారు. రైతులు పండించిన పంటలను నేరుగా విక్రయించుకునే విధంగా దళారుల వ్యవస్థ లేకుండా అధికారులతో ధాన్యం కొనుగోలు చేయించి పంట సొమ్మును నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లోనే వేయించే ఏర్పాటుచేశారు. రైతులకు నాణ్యమైన ఎరువులు, పురుగు మందులు తక్కువ ధరకు అందుబాటులో ఉండే విధంగా 40కు పైగా రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేయగా పంట పెట్టుబడి సాయంగా సుమారు 6,500 మంది రైతులకు ఏడాదికి రూ.15 వేలు చొప్పున బ్యాంకు ఖాతాల్లో వేశారు. అంతేగాకుండా రైతు భరోసా కేంద్రాల్లోని వ్యవసాయశాఖ సిబ్బంది నిత్యం రైతులకు అందుబాటులో ఉంటూ వరిసాగులో వారి సందేహాలను నివృత్తిచేస్తూ అధిక దిగుబడికి కృషి చేశారు.

రొయ్యల రైతుల పరిస్థితి దారుణమే

నియోజకవర్గంలో సుమారు 5వేల ఎకరాల్లో రొయ్యల సాగు చేస్తుండగా అమెరికా పన్నుల పేరుతో రొయ్యల ధరలను ఘననీయంగా తగ్గించినా.. ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో కిలో రొయ్యలకు సుమారు రూ.50 వరకు రైతులు నష్టపోయారు. జోన్స్‌తో ప్రమేయం లేకుండా రొయ్యల రైతులందరికీ సబ్సిడీ విద్యుత్ అందిస్తామన్న హామీ అమలుకు నోచుకోలేదు. రొయ్యల ధరలు తగ్గడం, మేతలు ధరలు పెరగడంతో తీవ్రంగా నష్టపోతున్న రైతులు క్రాప్ హాలీడే ప్రకటించినా ప్రభుత్వం స్పందించడం లేదు. దీంతో రైతన్నల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. ఏ రైతును పలకరించినా జగనన్న పాలనే మేలని.. ఎన్నికల్లో నమ్మించి ఓట్లు వేయించుకున్న కూటమి నాయకులు తమ గోడు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పంటను అమ్ముకోవాలన్నా రోడ్డెక్కి ఆందోళనలే..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. రైతు సేవాకేంద్రాల్లో సేవలు కరువయ్యాయి. ఇప్పటి వరకు ఒక్క విడత రైతు భరోసా సహాయం అందించకపోగా గత సార్వా సీజన్‌లో జూన్‌నెలలో అధికవర్షాలు, వర్షాల కారణంగా పంట నష్టపోయిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ కూడా అందించలేకపోయారు. రైతులు పండించిన పంటను విక్రయించుకోడానికి కూడా రోడ్డెక్కి ఆందోళనలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

వైభవంగా గంగానమ్మ, మద్దిరావమ్మ వార్షికోత్సవం


అమ్మవార్లకు పట్టువస్త్రాల్ని సమర్పించేందుకు ఊరేగింపుగా వస్తున్న గ్రామ పెద్దలు

ఆకివీడు: స్థానిక మాదివాడలోని గంగానమ్మ, మద్దిరావమ్మ అమ్మవార్ల జాతర మహోత్సవం ఆదివారం అంగరంగ వైభవంగా జరిగింది. తొలుత గ్రామ పెద్దలు చుండూరి వెంకట్రావు కుమారులు సత్యనారాయణ దంపతులు, రామకృష్ణ దంపతులు ఊరేగింపుగా పానకం కావిడితో వచ్చి అమ్మవార్లకు పట్టు వస్త్రాలు సమర్పించారు. అనంతరం స్థానిక డిప్యూటీ స్పీకర్ కె.రఘురామకృష్ణంరాజు పట్టువస్త్రాల్ని సమర్పించారు. ఈ సందర్భంగా అమ్మవారికి మహా కుంభం సమర్పించారు. పసుపు, కుంకుమ, బండారీతో పూజలు చేశారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు చుండూరి వెంకట్రావు, మోటుపల్లి ప్రసాద్, సత్యనారాయణ, నర్సింహరావు, గంగాధరరావు, పుప్పాల సత్యనారాయణ (పండు), గంగాధర్ (చిన్నా), కేశిరెడ్డి మురళీ, ఆరేటి త్రిమూర్తులు, బండారు లక్ష్మణరావు పాల్గొన్నారు. అనంతరం వేలాది మంది భక్తులు అఖండ అన్న సమారాధనలో పాల్గొన్నారు.

కూటమి వంచన.. అందని సంక్షేమ పాలన

వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి


భీమవరం నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ సమన్వయ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న ప్రసాదరాజు

భీమవరం: సంక్షేమ పాలన అందిస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం.. ఏడాది పాలనలో ఏ పథకాలు అమలు చేయకుండా ప్రజలను వంచించిందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు విమర్శించారు. కూటమి ప్రభుత్వ విధానాలకు నిరసనగా ఈనెల 4న వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో తలపెట్టిన వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఆదివారం భీమవరం మండలం చినఅమిరం గ్రామంలో ఏర్పాటుచేసిన భీమవరం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పనితీరు గతంలో మామ ఎన్‌టీఆర్‌కు పొడిచిన వెన్నుపోటు ప్రజలకు గుర్తుకువస్తుందన్నారు. గత ప్రభుత్వంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలుచేసిన అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో అటకెక్కించి ప్రజలకు వెన్నుపోటు పొడిచిందని విమర్శించారు. పార్టీ నరసాపురం పార్లమెంట్ పరిశీలకుడు ముదునూరి మురళీకృష్ణంరాజు మాట్లాడుతూ వెన్నుపోటు దినం కార్యక్రమంలో పార్టీ శ్రేణులతోపాటు దగాపడ్డ వలంటీర్లు, ఎండీయూ వాహనదారులు, ప్రజలను భాగస్వాములు చేయడానికి గ్రామస్థాయిలో వారికి అవగాహన కల్పించి పెద్ద సంఖ్యలో పాల్గొనే విధంగా చేయాలన్నారు.

కేసులు పెట్టడానికి ప్రయత్నించినా.. తగ్గేదే లేదు

మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు మాట్లాడుతూ కూటమికి వ్యతిరేకంగా ఉన్నవారిని అణిచివేయడానికి ప్రయత్నాలు చేస్తున్నారని, ఎవరూ భయపడనవసరం లేదని.. వైఎస్సార్ సీపీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. తనపై కేసులు పెట్టడానికి కూడా తీవ్రంగా ప్రయత్నిస్తున్నారని అటువంటివాటికి తగ్గేదే లేదన్నారు. సంపద సృష్టిద్దామంటూ పదేపదే చెబుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు విద్యుత్‌చార్జీల పెంపు, సూపర్ సిక్స్ పథకాలకు ఎగనామం పెట్టడం ద్వారా సంపద సృష్టిస్తారా అని ప్రశ్నించారు. భీమవరం, తణుకు పట్టణాలను పేకాట కేంద్రాలు మార్చివేశారని ఆవేదన వ్యక్తం చేశారు. పెచ్చుమీరిన జూదాలతో ప్రభుత్వం రక్తం పిండేస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్ మాట్లాడుతూ పార్టీశ్రేణులంతా సమన్వయంతో వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. పార్టీ నరసాపురం పార్లమెంట్ ఇన్‌చార్జి గూడూరి ఉమాబాల మాట్లాడుతూ భీమవరం నియోజకవర్గంలో ఇన్‌చార్జి లేరనే లోటును అధిగమించి పార్టీశ్రేణులంతా ప్రభుత్వ మోసాలను ఎండగట్టాలన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు మేడిద జాన్సన్, నౌడు వెంకటరమణ, ఏఎస్ రాజు, కోడే విజయలక్ష్మి, పేరిచర్ల విజయనర్సింహరాజు, చిగురుపాటి సందీప్, చినమిల్లి వెంకట్రాయుడు, గాదిరాజు రామరాజు, చవాకులు సత్యనారాయణ, జల్లా కొండయ్య, ఇంటి సత్యనారాయణ, బందన పూర్ణచంద్రరావు, పెనుమాల నర్సింహస్వామి, కోడే యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలను నెరవేర్చని కూటమి ప్రభుత్వం


పెద అమీరం కార్యాలయంలో వెన్నుపోటు దినం కార్యక్రమ పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

కాళ్ల: ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా చంద్రబాబు రాష్ట్ర ప్రజలకు వెన్ను పోటు పొడిచారని.. దీనిని నిరసిస్తూ వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాద్ రాజు కోరారు. పెద అమీరంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ప్రసాద్‌రాజు, నరసాపురం పార్లమెంట్ పరిశీలకుడు ముదునూరి మురళీకృష్ణంరాజు మాట్లాడారు. ఈఏడాది పాలన చూస్తుంటే 2014 చంద్రబాబు పాలన గుర్తుకొస్తుందన్నారు. అదేవిధంగా మరల అబద్ధాలాడి 2024లో అధికారంలోకి వచ్చిన ప్రజలను మోసం చేశారని అన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలను ఒక్కొక్కటిగా నిర్వీర్యం చేస్తూ ప్రజలను కష్టాలపాల్జేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చంద్రబాబుకు ఎందుకు ఓటేశామని ప్రజలు ఇప్పుడు బాధపడుతున్నారని అన్నారు. ఈ నెల 4న నియోజవర్గం కేంద్రంలో తలపెట్టిన వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించి ప్రభుత్వానికి బుద్ధి వచ్చేలా చేయాలని నాయకులు, కార్యకర్తలను కోరారు. అనంతరం వెన్నుపోటు దినం కార్యక్రమ పోస్టర్‌ను నాయకులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వర రావు, ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్, నర్సాపురం పార్లమెంట్ ఇన్‌చార్జి గూడూరి ఉమాబాల, పాలకొల్లు నియోజవర్గ ఇన్‌చార్జి గుడాల గోపి, మేడీద జాన్సన్, ఆకివీడు మున్సిపల్ చైర్‌పర్సన్ జామి హైమావతి, పెనుమత్స దుర్గాప్రసాద్ రాజు, పెనుమత్స ఆంజనేయరాజు, గలవల్లి ధనుంజయ్, ఉండి ఎంపీపీ ఇందుకూరి శ్రీహరిరాజు, సుంకర భోగేశ్వరరావు, నంద్యాల సీతారామయ్య, వేగేశ్న జయరామ కృష్ణంరాజు, కొలుకులూరి ధర్మరాజు, అంబటి రమేశ్, రణస్థుల మహంకాళి, షేక్ హుస్సేన్, గుండుగొల్లు ధనరాజు, బాలాజీ, కొండేటి శివకుమార్, నియోజకవర్గ స్థాయి పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రంగస్థల కళాకారుల సంఘ సేవలు అభినందనీయం


కళాకారులను సత్కరిస్తున్న సంఘ నాయకులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): రంగస్థల కళాకారుల సేవా సంఘం సేవలు అభినందనీయమని పలువురు ప్రముఖులు కొనియాడారు. సంఘం 156 నెలవారీ సభా కార్యక్రమం స్థానిక నందిబొమ్మ కూడలి రామాలయం ప్రాంగణంలో వైభవంగా నిర్వహించారు. సభకు సంఘం అధ్యక్షుడు సూరంపూడి వెంకటరమణ అధ్యక్షత వహించారు. ఆరుగొలను సొసైటీ మాజీ అధ్యక్షుడు నూకల బుల్లియ్య, న్యాయవాది ఎన్‌వీ, శ్రీశ్రీ అంతర్జాతీయ కవితా వేదిక కార్యదర్శి కొల్లి రమావతి మాట్లాడుతూ 45 సంవత్సరాలుగా కళాకారుల సంఘం పేద కళాకారులకు చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. డాక్టర్ పడాల దుర్గ, మధు మండేశ్వర్ దంపతులకు గౌరవ సత్కారం, భజన గురువు ఆవుల కొండలరావుకు (కొమ్మర) కళా సత్కారం, ఉపాధ్యాయులు కడలి సత్యనారాయణ (ఇరగవరం)లకు ఉత్తమ ఉద్యోగ సేవా పురస్కారం అందజేశారు. హరికథ కళాకారిణి ఎస్.విజయలక్ష్మికి ఆర్థిక సత్కారం చేశారు. షేక్ ఫాతిమా ప్రార్థనా గీతం ఆలపించారు. సినీ సంగీత విభావరి, నండూరి లక్ష్మీ యశోద చైత్రికచే కూచిపూడి నృత్యాలు అలరించాయి.

350 మందికి వైద్యసేవలు

పాలకోడేరు: విస్సాకోడేరు సెయింట్ జాన్ హైస్కూల్లో సెయింట్ జాన్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈశ్వర్ హాస్పిటల్ చిన్నరంగనిపాలెం వైద్యు లు వైద్య సేవలందించారు. డాక్టర్ నడింపల్లి పవన్ వర్మ రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. విస్సాకోడేరు చుట్టుపక్కల గ్రామాలవారు సుమారు 350మంది ఈ శిబిరంలో వైద్యసేవలు పొందారు. విస్సాకోడేరు సర్పంచ్ బొల్లా శ్రీనివాస్, నడిపూడి వెంకట అప్పారావు, గుండె నగేష్ బాబు, సెయింట్ జాన్ డైరెక్టర్ పీజే రాజశేఖర్ బాబు, స్కూల్ ప్రిన్సిపాల్ డాక్టర్ డీఆర్ స్వర్ణలత, పెనుమాల రిచ్చి, కాటం సుందర్ శేఖర్, ఈశ్వర హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

భూసారంతో అధిక దిగుబడులు


యనమదుర్రులో మాట్లాడుతున్న పెదవేగి ప్రిన్సిపాల్ శాస్త్రవేత్త డాక్టర్ ప్రసాద్

భీమవరం అర్బన్: భూసారం ఆధారంగా వరి సాగు చేపడితే అధిక దిగుబడులు సాధించవచ్చని పెదవేగి ప్రిన్సిపాల్ శాస్త్రవేత్త డాక్టర్ ఎంవీ ప్రసాద్ అన్నారు. భీమవరం మండలంలోని యనమదుర్రు గ్రామంలో ఆదివారం వికషిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా వరి, ఆక్వాసాగులో రైతులు అడిగిన పలు సందేహాలకు ఏడీఏ శ్రీనివాస్, శాస్త్రవేత్తలు సమాధానం చెప్పారు. అనంతరం పెదవేగి ప్రిన్సిపాల్ శాస్త్రవేత్త డాక్టర్ ఎంవీ ప్రసాద్ మాట్లాడుతూ రైతులు తప్పకుండా తమ పొలాల్లో భూసార పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. కొందరు రైతులు అలా చేయకుండా విచక్షణ రహితంగా ఎరువులు, పురుగు మందులు వాడటంతో భూమిలో ఉన్న పోషకాలు దెబ్బతినడమే కాకుండా సాగులో ఖర్చు ఎక్కువ అవుతుందన్నారు. సాగులో సాంకేతికతను అందిపుచ్చుకుని అధిక దిగుబడులిచ్చే నూతన వంగడాల గురించి రైతులు ఎప్పటికప్పుడు అవగాహన పెంచుకోవాలన్నారు. ఖరీఫ్ సాగు సమీపిస్తుందని భూ సారం పెరిగేందుకు రైతులు పచ్చిరొట్ట, పశువులు, కోళ్ల ఎరువులు వేసుకుంటే అధిక దిగుబడి సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో మార్టేరు, ప్రిన్సిపాల్ శాస్త్రవేత్త డాక్టర్ సుధీర్ రెడ్డి, మండల పశువైద్యాధికారి పి. పుండరీబాబు, వ్యవసాయ విస్తరణాధికారి బి దేవి స్వరూప తదితరులు పాల్గొన్నారు.

రేషన్ కష్టాలు.. మళ్లీ మొదలు

- తొలి రోజే మొరాయించిన సర్వర్లు
- రేషన్ దుకాణాల వద్ద పడిగాపులు


ఆకివీడు తీగల దొడ్డి వద్ద మొరాయించిన సర్వర్లతో చతికిలబడ్డ రేషన్ లబ్ధిదారులు


భీమవరం 18వ వార్డు రేషన్ షాప్ వద్ద క్యూలో నిలబడి రేషన్ తీసుకుంటున్న జనం

ఆకివీడు: రేషన్ కష్టాలు మళ్లీ మొదటికొచ్చాయి. గత వైఎస్సార్ సీపీ పాలనలో ఇంటి వద్దకే రేషన్ అందించగా.. ప్రజలపై పగబట్టిన చంద్రబాబు ఆ విధానాన్ని రద్దు చేసి తిరిగి రేషన్ దుకాణాల వద్దే రేషన్ సరఫరా చేసే విధానాన్ని మళ్లీ ప్రారంభించారు. దీంతో రేషన్ దుకాణాల వద్ద లబ్ధిదారులు క్యూలో పడిగాపులు పడే పరిస్థితులు రానున్నాయి. దీనికితోడు పాత విధానాన్ని మళ్లీ ప్రారంభించిన తొలిరోజే సర్వర్లు మొరాయించడంతో రేషన్ దుకాణాల వద్ద వచ్చిన అరకొర లబ్ధిదారులు పడిగాపులు పడ్డారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఆదివారం రేషన్ బియ్యం డీలర్ల ద్వారా సరఫరా చేసే ప్రక్రియను ప్రారంభించారు. ఆదిలోనే హంసపాదన్నట్లు ప్రారంభించిన కొద్ది నిమిషాలకే చాలా చోట్ల డీలర్ల వద్ద సర్వర్లు మొరాయించాయి. దీంతో దూరాల నుంచి వచ్చిన రేషన్ లబ్ధిదారులు గంటల తరబడి డీలర్ల వద్ద వేసి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. కొన్నిచోట్ల క్యూలో వినియోగదారులు నిలబడి రేషన్ తీసుకోగా, మరి కొని చోట్ల సర్వర్లు మొరాయించడంతో మళ్లీ ఏమి వస్తామని అక్కడే చతికలపడిపోయారు. వృద్ధులు, వంటరి మహిళలు, దివ్యాంగులు రేషన్ బియ్యాన్ని మోసుకువెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇవేమి తిప్పలురా బాబూ అంటూ తలలు పట్టుకుంటున్నారు.

సంక్షేమానికి ఎగనామం

ఉండి: కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయకపోగా.. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను సైతం నిర్వీర్యం చేస్తోంది. దీనిలో భాగంగా ఇంటింటికీ రేషన్ విధానాన్ని రద్దు చేసి రేషన్ దుకాణాల వద్ద రేషన్ సరఫరా చేస్తుండడంపై ప్రజల్లో తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది. దీనికితోడు ఆదివారం రేషన్ దుకాణాల వద్ద కూటమి నాయకులు ఆర్భాటాలు చేస్తూ ఫొటోలకు ఫొజులివ్వడంపై ప్రజలు మండిపడుతున్నారు. మండలంలో ఆదివారం రేషన్ షాపుల వద్ద మండుటెండలో పడిగాపులు పడలేక లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కూటమి ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయాన్ని పునఃసమీక్షించాలని ప్రజలు కోరుతున్నారు.

సర్వత్రా నిరసనలు

భీమవరం అర్బన్: మండలంలో సోమవారం అట్టహాసంగా రేషన్ షాపులు ప్రారంభించినా లబ్ధిదారులు ఎవరూ రాకపోవడంతో కూటమి నాయకులు, డీలర్లు చుట్టుపక్కల లబ్ధిదారులను పిలిచి మొక్కబడిగా ప్రారంభించారు. ఇప్పటివరకు ఇంటి వద్దకే రేషన్ రాగా.. ఇప్పుడు మళ్లీ చౌక దుకాణాలకు వెళ్లాల్సి రావడంపై ప్రజలు మండిపడుతున్నారు. నాగిడిపాలెం గ్రామంలో చుట్టుపక్కల వారిని కొందరిని పిలిచి రేషన్ ఇచ్చారు. దెయ్యాలతిప్ప గ్రామంలో రేషన్ దుకాణాన్ని తూతూ ప్రారంభించి మళ్లీ వెంటనే దుకాణం తలుపులు మూసివేయడంపై సర్వత్రా నిరసనలు వెల్లువెత్తుతున్నాయి.

శివారు ప్రాంతాలవారికి తప్పని కష్టాలు

భీమవరం (ప్రకాశం చౌక్): ఇంటింటికీ రేషన్ విధానాన్ని రద్దు చేసి దుకాణాల వద్దే రేషన్ తీసుకోవాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించడంతో మళ్లీ రేషన్ కష్టాలు మొదలయ్యాయి. తొలిరోజు వృద్ధులకు దివ్యాంగులకు పట్నంలో రేషన్ పంపిణీ జరగలేదు. షాపుల వద్దకు వెళ్లిన వారికి మాత్రమే రేషన్ అందింది. భీమవరం పట్టణంలో ఆదివారం కేవలం ఐదు నుంచి పది శాతం మంది లబ్ధిదారులు మాత్రమే రేషన్ పంపిణీ జరిగింది. కాగా పట్టణంలోని శివారు ప్రాంతాలవాసులు మాత్రం చౌకదుకాణాల్లో రేషన్ తీసుకునే విధానంపై మండిపడుతున్నారు. తాము దూరంగా ఉన్న చౌకదుకాణానికి వెళ్లాలంటే ఇబ్బందులు పడాలని, ఈ విధానాన్ని రద్దు చేసి ఇంటింటికీ రేషన్ విధానాన్ని కొనసాగించాలని కోరుతున్నారు.

కిలోమీటర్ దూరం వెళ్లాలి



ప్రతినెలా రేషన్ వాహనాలు ఇంటి వద్దకు వచ్చి రేషన్ బియ్యం ఇచ్చేవి. ఇప్పుడు రేషన్ వాహనాలు తీసియడం వల్ల మాకు కిలోమీటర్ దూరంలో ఉన్న రేషన్ దుకాణానికి వెళ్లాలి. వృద్ధులు, మహిళలు ఇబ్బందులు పడకుండా స్థానికంగా రేషన్ అందించాలి. – ఆర్ సూరమ్మ ఆరో వార్డు

దూరంగా రేషన్ దుకాణం



ఇంటింటికీ రేషన్ వాహనం వచ్చినప్పుడు సులభంగా రేషన్ తీసుకునేవాళ్లం. ఇప్పుడు రేషన్ వాహనాలు రద్దు చేశామని రేషన్ షాప్ వద్ద రేషన్ తీసుకోమంటున్నారు. సుమారు కిలోమీటర్ దూరంలో ఉన్న రేషన్ షాపునకు వృద్ధులు వెళ్లడం చాలా కష్టంగా ఉంటుంది. అనారోగ్యంగా ఉన్నవారు కూడా వెళ్లలేరు కాబట్టి మా ప్రాంతంలో రేషన్ షాప్ ఏర్పాటు చేసి ప్రతినెలా రేషన్ అందించాలి. – ఆర్.వరాలు, పైపుల చెరువు రోడ్డు

నృత్య ప్రదర్శనలో విద్యార్థుల ప్రతిభ

నరసాపురం: షిర్డీలోని బాబా సమాధి శతాబ్ది వేదికపై గత నెల 27 నుంచి నాలుగు రోజుల పాటు నిర్వహించిన కూచిపూడి నృత్యప్రదర్శనల్లో నరసాపురం శ్రీ ఆదిపరాశక్తి నృత్యనికేతనం విద్యార్థుల ప్రదర్శనలు అలరించాయి. నాట్యాచారిణి వలవల అనంతలక్ష్మీదేవి శిష్యులు శ్రీనిధి. సాత్విక, సాయిశ్రిత, అనన్య, యోగ్యశ్రీ, నందిని, ప్రణవి, తన్వికశ్రీ తదితరులు 50 మంది పాల్గొన్నారు. బాబా జీవిత విశేషాలతో కూడిన చిన్నారులు ఇచ్చిన నృత్య ప్రదర్శనలు ప్రశంసలు అందుకున్నట్టు అనంతలక్ష్మీదేవి చెప్పారు. షిర్డీలో నృత్య ప్రదర్శనలు ఇచ్చి వచ్చిన అనంతలక్ష్మీదేవితోపాటు శిష్య బృందాన్ని ఆదిపరాశక్తి నృత్యనికేతనం అధ్యక్షుడు కర్నల్ రావు, ఉపాధ్యక్షుడు ఆర్‌వీ సుబ్బారావు, కార్యదర్శి రంగినీడి సుబ్బారావు తదితరులు అభినందించారు.